
సాక్షి
పల్నాడు
శనివారం । 18 । జనవరి । 2025



పెన్షనర్లకు వైద్యపరీక్షలు

వినుకొండ(నూజెండ్ల): పలు గ్రామాల్లో మంచానికే పరిమితమై వివిధ రకాల పింఛన్లు తీసుకుంటున్న లబ్ధిదారులకు శుక్రవారం వైద్యులు పరీక్షలు నిర్వహించారు.



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ డెల్టా ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 1,818 క్యూసెక్కులు విడుదల చేశారు.



కర్పూర యజ్ఞ మహోత్సవం

భట్టిప్రోలు(కొల్లూరు): అద్దేపల్లి రామనామ క్షేత్రంలో శ్రీరామ నామస్మరణ కోటి మహోత్సవాలను పునస్కరించుకుని శుక్రవారం కర్పూర యజ్ఞ కార్యక్రమాలు నిర్వహించారు.

నల్లిగిపోతున్న మిర్చి రైతులు

- గణనీయంగా తగ్గిన దిగుబడులు
- ఎకరాకు రూ.లక్షకుపైగా నష్టం తప్పదంటున్న కర్షకులు
- వచ్చే దిగుబడులు పురుగుమందుల ఖర్చుకూ చాలవంటూ ఆవేదన
- మద్దతు ధర ప్రకటించడంలో సర్కారు విఫలం
- జిల్లాలో 1.10 లక్షల హెక్టార్లకుపైగా మిర్చి సాగు

నట్టేట ముంచిన నల్లి, ఎర్రనల్లి తెగుళ్లు



అచ్చంపేటలో నల్లి తెగులు సోకిన మిర్చి పంట

అచ్చంపేట: మిర్చి రైతు నలిగిపోతున్నాడు. ఆరుగాలం పండించిన పంట తెగుళ్ల బారిన పడడంతో తల్లడిల్లుతున్నాడు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది 1.10 లక్షల హెక్టార్లలో మిర్చి సాగైంది. పెట్టుబడులు భారీగా పెరిగాయి. అప్పోసప్పోచేసి సాగు చేసిన రైతులు దిగుబడులపై గంపెడాశలు పెట్టుకున్నారు. ఆ ఆశలను నల్లి, ఎర్రనల్లి తెగుళ్లు ఆవిరి చేస్తున్నాయి. పంటలను నాశనం చేస్తున్నాయి.

ఆ నియోజకవర్గంలో తీవ్రంగా..

జిల్లాలోని చాలా మండలాల్లో మిర్చి పంటల్లో నల్లి, ఎర్రనల్లి తెగుళ్ల ప్రభావం కనిపిస్తోంది. పెదకూరపాడు నియోజకవర్గంలో ఈ సమస్య తీవ్రంగా ఉంది. అచ్చంపేట, క్రోసూరు, అమరావతి మండలాల్లో నల్లి, ఎర్రనల్లి సోకి పంట కుళ్లిపోతోంది. పూత పిందె కాకముందే రాలిపోతోంది. పండిన పంటలో తాలు శాతం ఎక్కువగా ఉండే అవకాశం కనిపిస్తోంది. పెదకూరపాడు నియోజకవర్గంలో మొత్తం 25 వేల ఎకరాలకుపైగా మిర్చి పంట సాగు కాగా, పదివేల ఎకరాల్లో నల్లి, ఎర్ర నల్లి తెగులు సోకినట్టు తెలుస్తోంది.

దిగుబడిపై తీవ్ర ప్రభావం

తెగుళ్ల వల్ల ఈ ఏడాది దిగుబడులు తగ్గే ప్రమాదం ఉందని రైతులు చెబుతున్నారు. ఏటా ఎకరాకు సగటున 30 క్వింటాళ్లపైగా దిగుబడి వస్తుందని, ఈ ఏడాది 15 క్వింటాళ్ల నుంచి 20 క్వింటాళ్లకు మించి దిగుబడి రాదని వాపోతున్నారు. అచ్చంపేట మండలంలోని పలు గ్రామాలలో 8 క్వింటాళ్ల నుంచి 15 క్వింటాళ్ల వరకే దిగుబడి వస్తున్నట్టు సమాచారం.

ధర ధమాల్

ఈ ఏడాది మార్కెట్లో మిర్చి ధర కూడా పడిపోయింది. గత ఏడాది ఇదే రోజుల్లో క్వింటా మిర్చి నాణ్యతను బట్టి రూ.18వేల నుంచి రూ.25వేల వరకు పలికింది. ఈ ఏడాది ఆర్మూర్ రకానికీ రూ.7 వేల నుంచి 8వేలకు మించి ధర లేదు. మద్దతు ధర ప్రకటించడంలోనూ సర్కారు విఫలమైంది. పురుగుమందుల ఖర్చుకు తగ్గట్టు కూడా ఆదాయం వచ్చేట్టు కనిపించడం లేదని, ప్రభుత్వం ఆదుకోవాలని లేకుంటే ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన చెందుతున్నారు. కొందరు రైతులు మిర్చి ప్రారంభ దశలోనే తెగుళ్లను చూసి భయంతో పంటను దున్నేసి మొక్కజొన్న వేసుకున్నారు.

పురుగుమందులకు భారీగా ఖర్చు

నల్లి తెగుళ్ల నివారణకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. మూడు,నాలుగు రోజులకోసారి రూ.30వేల ఖరీదైన పురుగుమందులు కొట్టినా ఫలితం లేకపోతోంది. మొక్క నాటే నాటికే ఎకరాకు రూ.70వేలకు పైగా ఖర్చయిందని, ఇతర ఖర్చులూ కలుపుకుని ఎకరాకు రూ.2లక్షలకుపైగానే పెట్టుబడి అవుతోందని రైతులు చెబుతున్నారు. కౌలు రైతులకు ఎకరాకు రూ.30వేల కౌలు అదనమని, ఎకరాకు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లే ఆస్కారం ఉందని చెబుతున్నారు.



ఎర్రనల్లి సోకిన మిర్చి మొక్క

తెగుళ్ల ప్రభావం ఉంది

జిల్లాలో మిర్చి పంటపై నల్లి, ఎర్రనల్లి, నల్ల తామర తెగుళ్ల ప్రభావం ఉంది. పంట బాగానే పండింది. ధర లేకపోవడం దురదృష్టకరం. తెగుళ్లు సోకిన మండలాలను గుర్తించి రైతులకు సూచనలిస్తాం. తెగుళ్లను నివారించొచ్చు. ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదు.

– రమణారెడ్డి,
ఉద్యానశాఖాధికారి, పల్నాడు జిల్లా

మిగిలేది అప్పులే



నేను రెండు ఎకరాల్లో ఆర్మూర్ రకం మిర్చి సాగువేశా. మా ఇంటిలో అందరం కష్టపడతాం. ఎకరాకు రూ.లక్షన్నరకు పైగా ఖర్చయింది. 15 క్వింటాళ్లకు మించి దిగుబడి వచ్చేట్టు లేదు. ప్రస్తుతం మార్కెట్లో క్వింటాకు రూ.7వేలకు మించి ధర లేదు. అప్పులే మిగిలేలా ఉన్నాయి.

– మేకల జగ్గయ్య, రైతు, రుద్రవరం

పంట దున్నేశా



రెండున్నర ఎకరాల్లో రూ.70 వేలు పెట్టుబడి పెట్టి మిర్చి వేశా. ప్రారంభంలోనే నల్లి, ఎర్రనల్లి తెగుళ్లు కనిపించాయి. అంతకు మించి పెట్టుబడి పెట్టే స్తోమత లేక పంట దున్నేసి మొక్కజొన్న వేశా.

– మారేడు సాంబశివరావు,
రైతు, రుద్రవరం

ఆత్మహత్యలే శరణ్యం



నేను రెండున్నర ఎకరాల్లో మిర్చి సాగు చేశా. తెగుళ్లు సోకాయి. మూడు రోజులకొకసారి రూ.30 వేలు ఖరీదు చేసే మందులు కొడుతున్నా ఫలితం లేదు. ఎకరాకు రూ.2లక్షలకుపైగా ఖర్చయ్యేటట్టు ఉంది. రైతులకు చాలా మందికి ఆత్మహత్యలే శరణ్యం. ప్రభుత్వం ఆదుకోవాలి.

– తిమ్మిశెట్టి రామారావు,
రైతు, అచ్చంపేట

మాస్‌క్లీనింగ్ డ్రైవ్‌ను విధిగా చేపట్టాలి

పల్నాడు డీపీఓ విజయభాస్కరరావు



యడ్లపాడు: ప్రతినెలా మూడో శనివారం ప్రతి గ్రామంలోనూ మాస్ క్లీనింగ్ డ్రైవ్‌ను విధిగా నిర్వహించాలని పల్నాడు జిల్లా పంచాయతీ అధికారి విజయభాస్కరరెడ్డి చెప్పారు. శుక్రవారం ఆయన యడ్లపాడు గ్రామాన్ని సందర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ స్వచ్ఛాంధ్ర –స్వచ్ఛదివస్ కార్యక్రమంలో భాగంగా గతంలో రీసర్వే పనులు పూర్తయిన గ్రామాల్లో స్వమిత్వ కార్యక్రమాన్ని తిరిగి ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. వంకాయలపాడు పంచాయతీలోని ఉప్పరపాలెంలో కొత్తగా స్వమిత్వ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ప్రతినెలా మూడో శనివారం గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు. ఘనవ్యర్థాల నిర్వహణ కేంద్రాల ద్వారా ప్రతినెలా ఆదాయం వచ్చేలా చర్యలు చేపట్టాలన్నారు. సోమవారం నుంచి ఇంటి పన్నుల వసూలు ప్రక్రియ చేపట్టాలని ఆదేశించారు. మార్చినాటికి నూరుశాతం పన్నులు వసూలు చేయాలని చెప్పారు. ఈ-ఆఫీస్ విధానాన్ని అమలు చేసి కాగిత రహిత సేవలు అందించాలని పేర్కొన్నారు. సమీక్షలో డీఎల్‌పీవో లక్ష్మణరావు, ఎంపీడీఓ హేమలతాదేవి, ఈవోపీఆర్డీ షేక్ జాకీర్‌హుస్సేన్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు దరఖాస్తు చేసుకోండి

రేపల్లెరూరల్: ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్‌ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో పీఎం ఇంటర్న్‌షిప్ కార్యక్రమంలో భాగంగా నిరుద్యోగులకు వివిధ కంపెనీలు, పరిశ్రమలలో ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు బాపట్ల జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి పి.ప్రణయ్ శుక్రవారం పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8555901198 నంబరులో సంప్రదించాలని కోరారు.

న్యూస్‌రీల్

విఘ్నేశ్వరునికి సంకటహర చతుర్థి పూజలు



అమరావతి: ప్రఖ్యాత పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలోని విఘ్నేశ్వరస్వామి ఉపాలయంలో శుక్రవారం సంకటహర చతుర్థి పూజలను నిర్వహించారు. ఆలయ అర్చకస్వామి జగర్లపూడి శేషసాయిశర్మ విఘ్నేశ్వర స్వామికి మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకాన్ని నిర్వహించారు. స్వామికి వివిధ రకాల పుష్పాలతో, గరికెతో విశేషాలంకారం చేశారు. ఈ సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామికి ప్రత్యేక పూజలు చేసి ఉండ్రాళ్లను సమర్పించుకున్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

వేగంగా అభయాంజనేయ స్వామి విగ్రహం నిర్మాణం



క్రోసూరు: క్రోసూరు శివారులోని ప్రధాన రహదారిపై చెరువుకట్ట వద్ద అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ కార్యక్రమాలు శరవేగంగా జరుగుతున్నాయి. సుమారు రూ.20 లక్షల అంచనాతో నిర్మితమవుతున్న అభయాంజనేస్వామి విగ్రహం, మండపాలను మార్చి నెలలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నట్లు కమిటీ తెలిపింది. క్రోసూరు గ్రామానికి అన్ని శుభాలు కలిగించాలన్న గ్రామస్తుల కోరిక మేరకు 30 అడుగుల అభయాంజనేయ విగ్రహాన్ని విగ్రహ కమిటీ సిద్ధం చేస్తోంది.

ముగిసిన పౌరాణిక, సాంఘిక నాటకాలు



వినుకొండ(నూజెండ్ల): సంక్రాంతి సందర్భంగా వినుకొండ మండలంలోని పెద్దకంచర్ల గ్రామంలో గ్రామీణ కళాపరిషత్, రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ వినుకొండ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పౌరాణిక సాంఘిక నాటకాలు శుక్రవారంతో ముగిశాయి. చింతామణి, సత్యహరిశ్చంద్ర నాటకాలతోపాటు చివరి రోజున రాజరాజ సుయోధన అనే పౌరాణిక రూపకం ప్రేక్షకులను అలరించింది. సుయోధనుడిగా ముత్తినేని గిరిబాబు, ఇతర పాత్రల్లో గుమ్మా శ్రీకాంత్ రెడ్డి రోటరీ క్లబ్ వారు నటన కౌశలంతో ప్రేక్షకులను అలరించారు. అనంతరం వివిధ పాత్రల్లో నటించిన కళాకారులను సత్కరించారు.

20 నుంచి రాష్ట్రస్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

దుర్గి: శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి 71వ వార్షిక కల్యాణ మహోత్సవం సందర్భంగా దుర్గిలో ఈనెల 20 నుంచి 23 వరకు రాష్ట్ర స్థాయి ఎడ్ల బల ప్రదర్శన పోటీలు నిర్వహిస్తున్నట్లు శుక్రవారం నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలను ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చేతుల మీదుగా ప్రారంభిస్తున్నట్లు వివరించారు. వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించనున్నామని పేర్కొన్నారు.

నిందితులకు జరిమానా

నరసరావుపేటటౌన్: అనధికారికంగా ఆక్సిటోసిన్ హార్మోన్ ఇంజక్షన్లు కలిగి ఉన్నట్లు నేరం రుజువు కావడంతో హైదరాబాద్‌కు చెందిన ఒ.సుబ్రమణ్యం రెడ్డి, నరసరావుపేటకు చెందిన షేక్ సైదాలకు ఒక్కొక్కరికి రూ 10,000, రెండు ట్రాన్స్‌పోర్ట్ సంస్థలకు మరో రూ.20,000, మొత్తం రూ.40 వేలు జరిమానా విధిస్తూ స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి టి.ప్రవళిక శుక్రవారం తీర్పు వెలువరించారు. పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. 2012 నవంబర్ 22న అప్పటి నరసరావుపేట డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎం.చంద్రశేఖరరావు పట్టణంలోని సాయి దత్త లారీ సర్వీస్ ట్రాన్స్‌పోర్ట్ కార్యాలయంలో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో 11 బాక్సుల ఆక్సిటోసిన్ హార్మోన్ ఇంజక్షన్లు అనధికారికంగా కలిగి ఉన్నట్లు గమనించారు. ఈ ఔషధాలు హైదరాబాద్‌కు చెందిన సాయి దత్త లారీ సర్వీస్ నుంచి పట్టణంలోని దాని అనుబంధ సంస్థ కార్యాలయానికి వచ్చినట్లు గమనించారు. వాటికి వేబిల్స్ కానీ లైసెన్సులు కానీ, రికార్డులు కానీ లేకపోవడంతో ట్రాన్స్‌పోర్టు సంస్థలపై వాటి నిర్వాహకులపై అధికారులు కేసు నమోదు చేశారు. విచారణలో నేరం రుజువు కావడంతో పైవిధంగా కోర్టు తీర్పు వెలువడింది.

20 నుంచి భూముల రీసర్వే

జేసీ సూరజ్ గనోరే

నరసరావుపేట: రైతుల భూముల్లో ఈనెల 20 నుంచి రీసర్వే ప్రారంభించాలని జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ గనోరే ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయం నుంచి రీ సర్వేకు సంబంధించి జిల్లా అధికారులు, తహసీల్దార్లు, రీ–సర్వే డెప్యూటీ తహసీల్దార్లు, మండల సర్వేయర్లు, గ్రామ సర్వేయర్లు, గ్రామ రెవెన్యూ అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జేసీ అవగాహన కల్పించారు. పొరపాట్లకు తావు లేకుండా సర్వే చేపట్టాలన్నారు. ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ నిబంధనలను వివరించారు.



కలెక్టర్ కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న జేసీ సూరజ్

నేడు స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్

ప్రతి నెలా మూడో శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్‌ను చేపడుతున్నట్టు జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్ గనోరే వెల్లడించారు. శుక్రవారం ఈ కార్యక్రమంపై వెబెక్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. పట్టణాలు, పల్లెల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. 'నూతన సంవత్సరం–పరిశుభ్రత ప్రారంభం' నినాదంతో స్వచ్ఛతా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో పారిశుద్ధ్య పనులను పర్యవేక్షించేందుకు నోడల్ అధికారులను నియమించాలని ఆదేశించారు.



ఆపసోపాలు

లైమ్ సిటీ పిడుగురాళ్లను పొగ మంచు ముంచెత్తుతోంది. ఉదయం పది గంటలైనా సూర్యుడు మంచుతెరలను చీల్చుకుని బయటకు రాలేకపోతున్నాడు. దీంతో వాహనదారులు ఆపసోపాలు పడుతున్నారు. దారి కనిపించక అవస్థలు పడుతున్నారు. లైట్ల వెలుతురులో నిదానంగా ప్రయాణిస్తున్నారు. మంచు దెబ్బను తట్టుకోలేక కొందరు ద్విచక్రవాహనదారులు హెల్మెట్లు, పాదచారులు మంకీ క్యాప్‌లు వాడుతున్నారు. కొందరు ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకూ జంకుతున్నారు. శుక్రవారం ఉదయం పిడుగురాళ్ల మాచవరం రోడ్డులో దర్శనమిచ్చిన చిత్రాలివీ..

- పిడుగురాళ్ల:

దారి మళ్లిన రూ.9.24 కోట్లు

అవినీతి బయటపడుతుందనే భయాందోళనలో జీఎంసీ కమిషనర్



మీడియాతో మాట్లాడుతున్న మేయర్ కావటి మనోహర్ నాయుడు

- సభ్యుల ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే కౌన్సిల్ సమావేశంపై తాత్సారం
- అందుకే హడావిడిగా స్టాండింగ్ కమిటీ ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల
- గుంటూరు నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు

నెహ్రూనగర్: విజయవాడ బుడమేరు వరద బాధితులకు సాయం పేరిట గుంటూరు నగర కమిషనర్ పులి శ్రీనివాసులు రూ.9.24 కోట్ల నిధులను పక్కదారి పట్టించారని నగర మేయర్ కావటి మనోహర్ నాయుడు ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. శుక్రవారం కౌన్సిల్ హాల్ వద్ద విలేకర్ల సమావేశంలో డెప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైఎస్సార్ సీపీ కార్పొరేటర్లతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 4వ తేదీన వాయిదా పడిన కౌన్సిల్ సమావేశాన్ని తిరిగి నిర్వహించాలని కమిషనర్‌కు 8, 16వ తేదీలలో లేఖ రాసినా పట్టించుకోలేదన్నారు. కమిషనర్‌కు ఫోన్ చేసినా, కార్యాలయ అధికారిని పంపించినా స్పందించకపోవడంతో శుక్రవారం కౌన్సిల్ హాల్ వద్ద నిరసనగా ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కమిషనర్ తీరు కౌన్సిల్‌ను అపహాస్యం చేయడమేనని పేర్కొన్నారు. అవినీతి బయటకు వస్తుందన్న భయంతో హడావిడిగా స్టాండింగ్ కమిటీ ఎన్నికకు సంబంధించిన నోటిఫికేషన్ విడుదల చేశారని మండిపడ్డారు. ఫిబ్రవరి 3వ తేదీ వరకు సమావేశం పెట్టకుంటే తరువాత ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందని, అలా సమస్య సమసిపోతుందని అనుకుంటే పొరపాటేనన్నారు. దోచుకున్న సొమ్ముకు సంబంధించి అధికారులు సమాధానం చెప్పాల్సిందేనని పేర్కొన్నారు.

అధికారుల ఖాతాలకు నగదు జమ

డెప్యూటీ మేయర్ ప్రశ్న వేస్తే అధికారులు నామమాత్రంగా సమాధానం ఇచ్చారన్నారు. ఈఈ కోటేశ్వరరావు బ్యాంకు ఖాతాకు రూ.కోటి, మరో ఈఈకి రూ.50 లక్షలు, ఇతర ఏఈలు, డీఈలకు రూ.లక్షలు వంతున మొత్తం రూ.9.24 కోట్లు కమిషనర్ చెల్లించారని పేర్కొన్నారు. కౌన్సిల్‌కు తాము వస్తున్నామని తెలిసి పోలీసు బందోబస్తు కావాలని అధికారులు చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కావాలనే కమిషనర్ రాజకీయం చేసి లబ్ధి పొందాలని చూస్తున్నట్లు ఆరోపించారు. దీనిపై కేంద్ర ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి, డెప్యూటీ సీఎంకు, మున్సిపల్ శాఖ మంత్రికి, క్యాట్‌కు ఫిర్యాదు చేస్తామని చెప్పారు. కౌన్సిల్ ఏర్పాటు విషయంలో న్యాయపరంగా పోరాడతామని పేర్కొన్నారు. బుడమేరు వరద బాధితులకు సాయంలో నిధుల గోల్‌మాల్ లెక్క తేలుస్తామని స్పష్టం చేశారు.

సమాజాన్ని మేల్కొలిపేవే నాటికలు

మూడో రోజు రసవత్తరంగా సాగుతున్న నాటికలు



ఏది నిజం నాటికలోని సన్నివేశం

యద్దనపూడి: నాటికల్లోని పాత్రల్లో ప్రేక్షకులు తమను తాము చూసుకోవటం ద్వారా సామాజిక చైతన్యం పెరుగుతుందని చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. మండలంలోని అనంతవరం గ్రామంలో ఎన్టీఆర్ కళాపరిషత్ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న ఉభయ తెలుగు రాష్ట్రాల నాటికల పోటీలలో భాగంగా మూడో రోజైన శుక్రవారం ప్రదర్శించిన నాటిక పోటీలు ఆద్యంతం ప్రేక్షకులను రంజింపజేశాయి. తొలుత ఎమ్మెల్యే జ్యోతిప్రజ్వలన చేశారు. కార్యక్రమంలో టీవీ విశ్లేషకులు ఇడుపులపాటి సాంబశివరావు, తెలుగు టీవీ నిర్మాతల మండలి అధ్యక్షుడు ఆరెకట్ల ప్రసాద్‌లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఎమ్మెల్యే పుల్లారావు మాట్లాడుతూ కళాపరిషత్‌ల ద్వారా నాటికల పోటీలు నిర్వహించి కళాకారులను అభినందిస్తూ గౌరవించడం అభినందనీయమని కొనియాడారు. ఆరెకట్ల ప్రసాద్ మాట్లాడుతూ సినిమా రంగంతో సమానంగా నాటక రంగానికి ప్రాధాన్యత కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. నాటకాల ద్వారా సమాజానికి ఉపయోగపడే సందేశాత్మక అంశాలు ఎన్నో మిళితమై ఉంటాయన్నారు. స్త్రీ ఔన్నత్యాన్ని ఇనుమడింపజేసేలా మంచి నాటకాలు రావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఇడుపులపాటి సాంబశివరావు మాట్లాడుతూ గతంలో గ్రామీణ ప్రాంతాల్లో టీవీలు, సినిమాలు లేని రోజుల్లో కాలక్షేపం కోసం నాటికలు ప్రదర్శించేవారని, అలాంటి సమయంలో చదువుతో సంబంధం లేకుండా ఎన్నో నాటక పద్యాలను ప్రజలు అలవోకగా చెప్పేవారంటే నాటకాలపై ప్రజలకు ఉన్న మక్కువ ఎంతో తెలుసుకోవచ్చన్నారు. కార్యక్రమంలో అనంతవరం కళాపరిషత్ అధ్యక్షుడు గుదే పాండురంగారావు, గుదే తారకరామారావు, మద్దినేని జయరామకృష్ణ, పెదవల్లి శ్రీనివాసరావు, పోపూరి శివసుబ్బారావు, నిమ్మల సాంబశివరావు, పెదవల్లి వెంకటేశ్వర్లు, మండవ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నైతిక విలువలు పెంచుకుంటేనే మనుగడ

తొలినాటికగా ఏది నిజం ప్రదర్శితమైంది. శాస్త్ర సాంకేతిక రంగాల్లో విప్లవాత్మకమైన అభివృద్ధి ఒక వైపు, దేశానికే తలమానికమైన కుటుంబ వ్యవస్థలో సంబంధ బాంధవ్యాలు, నైతిక విలువలు రోజురోజుకు క్షీణించిపోతున్న నేపథ్యంలో ఈ రెండు అంశాలు ప్రాతిపాదికన ఏది నిజమైన అభివృద్ధి ఉండాలో తెలుసుకోవాలని సందేశం ఇచ్చింది 'ఏది నిజం'. ఈ నాటికను శ్రీకారం రోటరీ కళాపరిషత్ మార్టూరు వారు ప్రదర్శించారు.



సాంబశివరావును సన్మానిస్తున్న ఎమ్మెల్యే, కళా పరిషత్ సభ్యులు

సాయం అందించడమే జీవిత పరమార్థం

స్నేహ ఆర్ట్స్ వింజనంపాడు వారిచే 'కొండంత అండ' నాటికలో చేలో పంటకు పట్టిన చీడను వదిలించుకోవటమే రైతు బాధ్యత అని, ప్రకృతి బీభత్సాలకు రోదించటమే రైతు వంతని అనుకోకుండా సమాజంలో జరిగే అవకతవకలను సరిచేసుకుంటూ సమస్యలకు ఎదురొడ్డి పోరాడుతూ స్వార్థపూరిత మనస్తత్వాలను సరిచేస్తూ, తోటి మనుషులకు తోడూనీడగా ఉండటమే జీవిత పరమార్థమని నమ్మిన ఓ రైతు కథ ఇది.

టెక్నాలజీనే మిత్రుడు, శత్రువు..

యువభేరి థియేటర్ ఆర్గనైజేషన్ హైదరాబాద్ వారిచే 'నా శత్రువు' అనే నాటికలో నేడు మనిషి మనుగడ టెక్నాలజీతో ముడిపడిపోయింది అనటంలో సందేహమే లేదు. ఎవరికి వారు సెల్‌ఫోన్‌తో బిజీగా గడుపుతూ బంధాలకు, అనుబంధాలకు దూరమై ఎవరికి వారు ఒంటరై పోతున్నారు. టెక్నాలజీని అవసరానికి మాత్రమే వాడితే దానికి మించిన మంచి మిత్రుడు మరొకరు ఉండరని అవసరం ఉన్నా లేకున్నా అదే లోకంగా భావిస్తూ వెళితే మాత్రం ఊహించని ప్రమాదాలు జీవితంలో సంభవిస్తాయని తెలియజేప్పే నాటికే నా శత్రువు.

క్లుప్తంగా

రేపటి నుంచి కబడ్డీ పోటీల సెలక్షన్లు

పిడుగురాళ్ల: పట్టణంలోని మాంటిస్సోరి ఇంగ్లిష్ మీడియం క్రీడా ప్రాంగణంలో ఆంధ్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నుంచి కబడ్డీ పోటీల సెలక్షన్లు నిర్వహించనున్నట్లు జాయింట్ సెక్రటరీ దోమా నాగరాజనేయరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాల్గొనే క్రీడాకారుల 25 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండాలని సూచించారు. పురుషులు 85 కేజీలు, స్త్రీలు 75 కేజీలు బరువు ఉండాలని తెలిపారు. సెలక్షన్‌కు వచ్చే క్రీడాకారులు ఆధార్ కార్డు ఒరిజినల్, పాస్ పోర్టు సైజు ఫొటోలు ఆరు తీసుకొని ఉదయం 10 గంటలకు పట్టణంలోని మాంటిస్సోరీ స్కూల్ క్రీడా ప్రాంగణానికి రావాలని సూచించారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25వ తేదీ నుంచి 17వ తేదీ వరకు విశాఖపట్నం జిల్లాల్లోని అంకుపాలెంలో జరిగే 71వ ఇంటర్ డిస్ట్రిక్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని ఆయన తెలిపారు. వివరాలకు ఎం. నాగేంద్రబాబు, సెల్ 9676271703లో సంప్రదించాలని ఆయన సూచించారు.

యార్డులో 47,441 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 40,178 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 47,441 బస్తాలు అమ్మకాలు నిర్వహించారు. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,200 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,500 వరకు ధర లభించింది. ఏసీ కామన్ రకం రూ.7,500 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. ఏసీ ప్రత్యేక రకాలకు రూ.7,500 నుంచి రూ.15,000 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.10,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 41,052 బస్తాలు నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి వినుకొండ ఆంజనేయులు తెలిపారు.

విద్యతోనే సమాజంలో ఉన్నత స్థానం

ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

దాచేపల్లి: విద్య ప్రధానమని, దాని ద్వారానే సమాజంలో ఉన్నత స్థానాన్ని అధిరోహించవచ్చని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. దాచేపల్లిలోని ఇస్లాహుల్ బనాత్ బాలికల అరబిక్ పాఠశాలలో అలీం కోర్సులు పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. గామాలపాడులోని మసీద్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విద్యార్థులకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, టీటీడీ బోర్డు సభ్యుడు జంగా కృష్ణమూర్తి అభినందించి, సర్టిఫికెట్లు అందించారు. మదర్సా నిర్వాహకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడుతూ నిరుపేద ముస్లిం బాలికలకు అలీం కోర్సులు ఉచితంగా అందించడం అభినందనీయని తెలిపారు. మదర్సా అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని, విద్యార్థులకు మంచి విద్య అందించేలా నిర్వాహకులు కృషి చేయాలని ఆయన సూచించారు. అనంతరం అంజుమన్ కమిటీ సభ్యులు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యే జంగాని శాలువా, పూలదండలతో సన్మానించారు. కార్యక్రమంలో సర్పంచ్ జంగా సురేష్, కౌన్సిలర్ షేక్ షరీఫ్, మాజీ సర్పంచులు మాశెట్టి పుల్లారావు, తంగెళ్ల శ్రీనివాసరావు, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మౌలానా ముస్తాఫా, స్థానికులు షేక్ జానీ బాషా, సయ్యద్‌జాను, చింతపల్లి హస్సన్ అహ్మద్ పాల్గొన్నారు.



మదర్సా నిర్వాహకులతో మాట్లాడుతున్న ఎంపీ

నర్సరీ భూములను పరిశీలించిన అధికారులు

రెంటచింతల: మండలంలో మాచర్ల-దాచేపల్లి బైపాస్ రోడ్డు(ఎన్‌హెచ్-167 ఏడీ) నిర్మాణంలో పాలువాయి జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన ఆరు షేడ్ నెట్ నర్సరీలు కోల్పోయిన భూములను నేషనల్ హైవే అథారిటీ విజయవాడ ఈఈ శ్రీనివాసరావు నేతృత్వంలోని బృందం శుక్రవారం పరిశీలించింది. పల్నాడు జిల్లా కలెక్టర్ పి. అరుణ్‌బాబు ఆదేశాల మేరకు జాతీయ రహదారి 167 ఏడీ ఏర్పాటు వల్ల షేడ్ నెట్ నర్సరీ రైతులు కోల్పోయిన భూమిని పునఃపరిశీలించేందుకు ఈ బృందం గురజాల ఆర్డీవో వి. మురళీకృష్ణ ఆధ్వర్యంలో పర్యటించింది. ప్రస్తుతం నర్సరీలలో ఎవరు ఉన్నారు..రహదారి నిర్మాణంతో కోల్పోతున్న భూముల వివరాలను సేకరించింది. ఆరు షేడ్ నెట్ నర్సరీలకు సంబంధించి మొత్తం 2.01 ఎకరాల భూమి కోల్పోయినట్లు మండల ఆర్ఐ పల్లా రామకృష్ణ తెలిపారు. పూర్తి నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేయ నున్నట్లు అధికారులు చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్‌వి. రమణారెడ్డి, ఇన్‌చార్జి తహసీల్దార్ పిన్నం బ్రహ్మయ్య, జాతీయ సెక్షన్ ఇంజినీర్ శ్రీనివాస్, గురజాల హెచ్ఓ వై. మోహన్, సర్వేయర్ నవులూరి రవీంద్రారెడ్డి, రహదారి గుత్తేదారు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు.



దేవాలయ భూములను పరిశీలిస్తున్న అధికారులు

కన్నుల పండువగా సుబ్రమణ్యేశ్వరస్వామి కల్యాణం

కర్లపాలెం: శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. కర్లపాలెం మండలం పెదపులుగువారిపాలెంలో సుబ్రమణ్యేశ్వరస్వామి శాంతి కల్యాణోత్సవంలో భాగంగా రెండు రోజుల నుంచి హోమాలు, విశేషపూజలు నిర్వహిస్తున్నారు. నాగమ్మతల్లి ఆలయం వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై శ్రీవల్లి, దేవసేన సమేత సుబ్రమణ్యేశ్వర స్వామి ఉత్సవ విగ్రహాలను, చిత్రపటాలను ఉంచి శాస్త్రోక్తంగా శాంతి కల్యాణం నిర్వహించారు. అఖండ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విన్నకోట సురేష్, కల్యాణోత్సవంలో పాల్గొని పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ ఫౌండేషన్ ఆర్థిక సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని విన్నకోట సురేష్ భక్తులతో కలసి ప్రారంభించారు. సురేష్ మాట్లాడుతూ సర్వమానవాళి సుఖశాంతులతో ఆయురారోగ్యాలతో పాడి పంటలతో వర్ధిల్లాలని గ్రామస్తులందరూ స్వామివారికి కల్యాణోత్సవం నిర్వహించటం అభినందనీయమని తెలిపారు.



కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

వైఎస్సార్ సీపీ జెండా దిమ్మె ధ్వంసం

సత్తెనపల్లి: వైఎస్సార్ సీపీ జెండా దిమ్మెను ధ్వంసం చేసిన ఘటన పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని 18వ వార్డు జెండా చెట్టు వద్ద శుక్రవారం రాత్రి జరిగింది. గుర్తు తెలియని దుండగులు పొక్లెయిన్ సాయంతో తొలగించారు. పొక్లెయిన్ చూసిన ఓ వ్యక్తి స్థానికులకు సమాచారమివ్వడంతో వైఎస్సార్ సీపీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికార పార్టీకి చెందిన వ్యక్తులు కావాలనే పుర పాలక సంఘానికి చెందిన పప పొక్లెయిన్‌తో దిమ్మెల ధ్వంసం చేశారని ఆరోపించారు. ఈ ఘటనపై అధికారులు స్పందించి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేపట్టాల్సి ఉంటుందని వైఎస్సార్ సీపీ శ్రేణులు హెచ్చరించారు.



జెండా దిమ్మె ధ్వంసం చేసిన ప్రాంతం

ఇటుక రాళ్లతో వ్యక్తిపై దాడి

వేమూరు: ఇటుక రాళ్లతో పోతార్లంక సుబ్రమణ్యంపై ముగ్గురు వ్యక్తులు దాడి చేశారని ఎస్ఐ రవికృష్ణ తెలిపారు. పోలీసు కథనం ప్రకారం.. పోతార్లంక సుబ్రమణ్యం, అద్దేపల్లి జాన్‌వెస్లీ, అద్దేపల్లి ప్రవచన్, గోనుగుంట్ల డేవిడ్ మధ్య గతం నుంచి గొడవలు ఉన్నాయి. గురువారం రాత్రి కోగంటి గోపి ఫర్టిలైజర్ షాపు వద్ద వీరి మధ్య గొడవ జరిగింది. అద్దేపల్లి జాన్‌వెస్లీ, అద్దేపల్లి ప్రవచన్, గోనుగుంట్ల డేవిడ్‌లు ఇటుక రాళ్లతో సుబ్రమణ్యంపై దాడి చేశారు. తీవ్ర గాయాలు కావడంతో 108 వాహనం ద్వారా తెనాలి ప్రభుత్వం వైద్యశాలకు తరలించారు. బాధితుడి భార్య జ్యోతి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.



పెట్రోల్ సిబ్బందిపై దాడిలో ఆరుగురిపై కేసు

మార్టూరు: పెట్రోల్ బంక్ సిబ్బందిపై దాడి చేసిన విషయమై ఆరుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ మద్దినేని శేషగిరిరావు శుక్రవారం వివరాల మేరకు.. సంక్రాంతి పండుగ సందర్భంగా గురువారం రాత్రి ద్రోణాదుల గ్రామంలో తిరునాళ్ల జరిగాయి. తిరునాళ్లకు వచ్చిన జొన్నతాళికి చెందిన కొందరు యువకులు అర్ధరాత్రి ఒకటిన్నర గంటల ప్రాంతంలో తిరిగి స్వగ్రామం వెళ్తూ గ్రామంలోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ వద్దకు వెళ్లి పెట్రోలు కొట్టమని సిబ్బందిని అడిగారు. పెట్రోల్ బంకు సిబ్బంది నరసింహారావు, సాంబయ్యలు ఆ యువకులతో బంకు మూసివేసి పడుకున్నామని పెట్రోలు కొట్టలేమని చెప్పారు. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య వాదన ప్రారంభమై జరిగిన ఘర్షణలో సిబ్బంది నరసింహారావుకు గాయాలయ్యాయి. అడ్డుకోవటానికి ప్రయత్నించిన పెట్రోల్ బంక్ సూపర్‌వైజర్ పెంట్యాల నాగేశ్వరరావు, స్థానికుడైన ముప్పరాజు ఉదయభాస్కర్లను కూడా యువకులు కొట్టి గాయపరిచినట్లు సీఐ చెప్పారు. శుక్రవారం రాత్రి పెంటేల నాగేశ్వరరావు ఇచ్చిన ఫిర్యాదుపై జొన్నతాళి గ్రామానికి చెందిన ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

21న జాబ్‌మేళా

క్రోసూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ(ఏపీఎస్ఎస్‌డీసీ) ఆధ్వర్యంలో 21న క్రోసూరులోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జి.తమ్మారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ అవకాశాన్ని పెదకూరపాడు నియోజకవర్గ నిరుద్యోగ యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. జాబ్ మేళాకు ఐసీఐసీఐ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ బరోడా, ముత్తూట్, ఎయిర్‌టెల్ పేమెంట్ బ్యాంక్, కపిస్టన్ సర్వీసెస్ వంటి పలు కంపెనీలు హాజరవుతున్నాయని తెలిపారు.ఎంపికైన అభ్యర్థులకు విద్యార్హత బట్టి రూ.12,000 నుంచి 35,000 వరకు వేతనం ఉంటుందని పేర్కొన్నారు.ఎస్ఎస్‌సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్ , డిప్లొమా, ఫార్మసీతో పాటు పీజీ చదివిన 18-35 మధ్య వయసున్న వారు అర్హులని తెలిపారు. బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికెట్స్, ఆధార్ ఫొటోస్టాట్, పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలని ఆయన సూచించారు. ఇంటర్వ్యూలు ఉదయం 9గంటల నుంచి 4గంటల వరకు జరుగుతాయని పేర్కొన్నారు. వివరాలకు బి.అంజిరెడ్డి (7779858789), ఈ.రామకృష్ణారెడ్డి (8074393466)ని సంప్రదించాలని తెలిపారు. తొలుత http://naipunyam.ap.gov.in/ అనే వెబ్‌సైట్‌లో పేరు రిజిస్టర్ చేసుకోవాలని కోరారు.

వాహనం ఢీకొని యువకుడి మృతి

అద్దంకి రూరల్: గుర్తు తెలియని వాహనం ఢీకొని బైకు మీద వెళ్తున్న యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన శుక్రవారం అద్దంకి మండలంలోని చక్రాయపాలెంలో చోటుచేసుకుంది. సీఐ ఏ.సుబ్బరాజు వివరాల మేరకు.. మండలంలోని చినకొత్తపల్లి గ్రామానికి చెందిన మాగంటి గోవర్ధన్ (30) ద్విచక్రవాహనంపై అద్దంకి వైపు వస్తున్నాడు. ఈక్రమంలో అద్దంకి నార్కెట్‌పల్లి నామ్ రహదారిపై మండలంలోని చక్రాయపాలెం గ్రామం రాగానే రహదారిపై వెనుకగా వస్తున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో తీవ్రగాయాలైన గోవర్ధన్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న సీఐ స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అద్దంకి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు

హత్య కేసులో నిందితుడి అరెస్ట్

తెనాలిరూరల్: మహిళ హత్య కేసులో నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. వన్‌టౌన్ సీఐ వి.మల్లికార్జునరావు శుక్రవారం తెలిపిన వివరాలు.. పట్టణంలోని ముత్తెంశెట్టిపాలెం నుంచి ఇస్లాంపేట వైపు వెళ్లే మార్గంలో మహిళ హత్య కేసులో నిందితుడిని తమిళనాడుకు చెందిన మణిగా గుర్తించారు. తెనాలిలో కొంతకాలంగా ఉంటూ రోజువారీ పనులకు వెళుతుండే మణికి ఇటీవల ఈ మహిళ పరిచయమైంది. ఈ నెల15వ తేదీ రాత్రి పొద్దుపోయాక మృతురాలితో కలసి మద్యం తాగేందుకు తూర్పు కాల్వకట్ట రోడ్డులోని ఓ మెకానిక్ షాపు వద్దకు వెళ్లారు. అక్కడ మాటామాటా పెరగడంతో మహిళపై దాడి చేయగా ఆమె మృతి చెందింది. ఈ కేసులో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు పోలీసులు తెలిపారు.

చోరీకి గురైన కారు స్వాధీనం



పెదకాకాని: చోరీకి గురైన కారును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పెదకాకాని పోలీసులు తెలిపిన వివరాలు.. గుంటూరు ఆటోనగర్‌లోని జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా కార్ షోరూమ్‌కు ఈనెల 15వ తేదీ తెల్లవారుజామున ఒక వ్యక్తి వచ్చి సెక్యూరిటీ గార్డుతో మా కార్ మీ షోరూంలో ఉంది. ఒకసారి అర్జెంటుగా చూడాలి అని చెప్పి ట్రయిల్ నిమిత్తం కారును కిందకు దింపి సెక్యూరిటీ గార్డును బెదిరించి కారు తీసుకెళ్లాడు. సెక్యూరిటీ గార్డు సమాచారంతో కారును గుర్తు తెలియని వ్యక్తి చోరీ చేసినట్లు గుర్తించి షోరూం ప్రతినిధులు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. స్పందించిన పోలీసులు ఒక్క రోజులో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి కారును గుర్తించారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని కారును స్వాధీనం చేసుకున్నారు. ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించి కారును గుర్తించిన సీఐ టీపీ నారాయణ స్వామి, ఎస్ఐ మీరాజ్, సిబ్బందికి జాస్పర్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాలి

- మాజీ మంత్రి విడదల రజిని పిలుపు
- జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు శ్రీకాంత్‌కి అభినందన

చిలకలూరిపేట: కూటమి ప్రభుత్వ వైఫల్యాలపై పోరాడాల్సిన సమయం ఆసన్నమైందని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి విడదల రజిని చెప్పారు. వైఎస్సార్ సీపీ పల్నాడు జిల్లా యువజన విభాగం నూతన అధ్యక్షుడిగా నియమితులైన కందుల శ్రీకాంత్ శుక్రవారం మాజీ మంత్రి విడదల రజినిని ఆమె నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలియజేశారు. ఆయనతో పాటు యువజన విభాగం, పార్టీ నాయకులు తరలివచ్చారు. వీరిని ఉద్దేశించి విడదల రజిని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలకు అండగా నిలిచి ప్రజా సమస్యలపై పోరాడాలని కోరారు. ప్రజలకు అడ్డగోలు హామీలు ఇచ్చిన ప్రభుత్వం వాటిని అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. ఒక్క హామీని కూడా నెరవేర్చకుండా ప్రజలను మోసం చేస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అమలయ్యే వరకు వైఎస్సార్ సీపీ పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈ విషయంలో యువజన విభాగం కీలక పాత్ర పోషించాల్సిన అవసరం ఉందన్నారు. పదవులు బాధ్యతను పెంచుతాయనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. యువజన విభాగం జిల్లా నూతన అధ్యక్షుడిగా నియమితులైన కందుల శ్రీకాంత్ మాట్లాడుతూ పార్టీ ఆదేశాల మేరకు పనిచేస్తానని, ప్రజలకు అండగా ఉంటామన్నారు. తనను నమ్మి పదవి వచ్చేలా చేసిన మాజీ మంత్రి విడదల రజినికి జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ముస్లిం సంచార జాతుల కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ దరియావలి, పార్టీ పట్టణ అధ్యక్షుడు క్లస్టర్-2 విడదల కమలేంద్ర, 29 వార్డు కౌన్సిలర్ షేక్ యూసుఫ్ ఆలీ, ఎస్టీ విభాగం నాయకుడు బి.బాలకోటినాయక్, పార్టీ వివిధ విభాగాల నాయకులు, యువజన విభాగం నాయకులు పాల్గొన్నారు.



మాజీ మంత్రి విడదల రజినీని సన్మానిస్తున్న నాయకులు

రాకేష్‌కు జాతీయ సాహితీ పురస్కారం



నరసరావుపేట ఈస్ట్: పట్టణానికి చెందిన సాహితీవేత్త, శ్రీశ్రీ కళావేదిక జాతీయ కార్యదర్శి గుండాల రాకేష్‌కు తెలుగు తేజం జాతీయ విశిష్ట సాహితీ పురస్కారం లభించింది. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్, వరల్డ్ రైటర్స్ ఫోరం అండ్ వరల్డ్ పోయెట్రీ అకాడమీ, గోదావరి సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ సంయుక్తంగా రాకేష్‌ను పురస్కారానికి ఎంపిక చేశారు. విజయవాడలోని కౌతా పూర్ణానంద్ విలాస్ కళావేదికలో ఈనెల 21న జరగనున్న సాహితీ సభలో పురస్కారం అందజేయనున్నారు. పురస్కారం క్రింద రూ.10వేలు నగదు, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో రాకేష్‌ను సత్కరించనున్నారు.ఈ మేరకు ఆయా సంస్థల నుంచి ఆహ్వానం అందినట్టు ఆయన శుక్రవారం తెలిపారు. తెలుగు భాష, సాహితీ, సాంస్కృతిక రంగాలలో చేస్తున్న కృషి, సేవలను గుర్తించి పురస్కారానికి ఎంపిక చేశారని పేర్కొన్నారు. జాతీయ పురస్కారానికి ఎంపికైన రాకేష్‌ను పలువురు సాహితీవేత్తలు అభినందించారు. తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య సేవలో తనను ప్రోత్సహిస్తున్న శ్రీశ్రీ కళావేదిక సీఈఓ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కన్వీనర్ కొల్లి రమాదేవి, జాతీయ అధ్యక్షురాలు జి.ఈశ్వరిభూషణానికి రాకేష్ కృతజ్ఞతలు తెలిపారు.

ముప్పాళ్ల దేశానికి ఆదర్శం

- ప్రభుత్వ ఛీప్ విఫ్ ఎమ్మెల్యే జి.వి.ఆంజనేయులు
- ముగిసిన జాతీయ కబడ్డీ పోటీలు
- ఇండియా నావీ టిమ్‌కు ప్రథమస్థానం

ఈపూరు(శావల్యాపురం) : గ్రామీణ క్రీడా పోటీల్లో ముప్పాళ్ల గ్రామం దేశానికి ఆదర్శమని ప్రభుత్వ చీఫ్ విప్ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. ఈపూరు మండలం ఆరేపల్లి ముప్పాళ్లలో జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు శుక్రవారం ముగిశాయి. విజేతలకు బహుమతులు ప్రదానోత్సవంలో ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు, పార్టీలకు కులమతాలకు అతీతంగా కబడ్డీ పోటీలు నిర్వహించడం ముప్పాళ్ల గ్రామ ప్రజలకు చైతన్యానికి, ఐక్యతకు నిదర్శమని పేర్కొన్నారు. సంప్రదాయ క్రీడలను 33 సంవత్సరాల నుంచి నిర్వహించడం అభినందనీయమని తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో భాగంగా మహాత్మా గాంధీ ముప్పాళ్ల గ్రామంలో రెండురోజుల పర్యటించారని, ఆ సమంలో ఆయన్ను వెండి, బంగారంతో తులాభారం వేసిన ఘనత ముప్పాళ్ల వాసులకే దక్కుతుందని చెప్పారు. అనంతరం మొదట బహుమతి రూ.3లక్షలను ఇండియన్ నావీ టీమ్ సభ్యులు, రెండవ బహుమతి రూ.2లక్షలను తమిళనాడు టీమ్, మూడోవ బహుమతి రూ.లక్షను ఆంధ్ర స్టైటీమ్, నాల్గవ బహుమతి రూ.70వేలను కర్ణాటక టీమ్ సభ్యులకు అందించారు. నగదు బహుమతులతో పాటు మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు, వడ్లమూడి వెంకట కిశోరు, తల్లపనేని రామారావు, కంచేటి కోటేశ్వరరావు, సూరె కోటేశ్వరరావు, పులి శ్రీనివాసరెడ్డి, మద్దినేని శ్రీనివాసరావు, ఇడపలపాటి హనుమయ్య, రాపర్ల జగ్గారావు, ఎం.నరసింహారావు, పీఈటీ రాజేష్, పాల్గొన్నారు.



ఇండియా నావీ టిమ్ సభ్యులకు మెమెంటోను అందజేస్తున్న ఎమ్మెల్యే ఆంజనేయులు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో మెరిసిన ప్రేమ్‌సాగర్

- తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ కైవసం
- వెల్లువెత్తుతున్న అభినందనలు

చీరాల రూరల్: ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ స్థాయి వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో చీరాలకు చెందిన దేవరకొండ ప్రేమ్‌సాగర్ అద్భుత ప్రదర్శన కనబరిచాడు. తృతీయ స్థానంలో నిలిచి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈనెల 15 నుంచి 18 వరకు పంజాబ్ రాష్ట్రంలోని జలంధర్ లవ్‌లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీలో ఆలిండియా యూనివర్సిటీస్ చాంపియన్‌షిప్ పోటీలు 2025 నిర్వహిస్తున్నారు. పోటీల్లో చీరాల సాయికాలనీకి చెందిన ప్రస్తుతం వైఎస్సార్ కడప యోగి వేమన యూనివర్సిటీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్న దేవరకొండ ప్రేమ్‌సాగర్ 81 కిలోల విభాగంలో పాల్గొన్నాడు. స్నాచ్‌లో 140 కిలోలు, క్లీన్ అండ్ జర్క్‌లో 166 కిలోలు ఎత్తాడు. ఓవరాల్‌గా 306 కిలోల బరువులతో తృతీయ స్థానం సాధించి బ్రాంజ్ మెడల్ కైవసం చేసుకున్నాడు. ఈ పోటీల్లో దేశంలోని 40 యూనివర్సిటీలకు చెందిన 200 మంది లిఫ్టర్లు పాల్గొనగా 81 కిలోల విభాగంగా మన రాష్ట్రం నుంచి ప్రేమ్‌సాగర్ ఒక్కడే పాల్గొనడం విశేషం.



బ్రాంజ్ మెడల్ సాధించిన ప్రేమ్‌సాగర్

అభినందనలు.. ఎంతో పట్టుదలతో కృషిచేసి తృతియ స్థానం సాధించి మన రాష్ట్రంతో పాటు చీరాలకు పేరు ప్రతిష్టలు అందించాడు. ఆల్ ఇండియా స్థాయిలో పతకం సాధించిన తనను ఇంతగా ప్రోత్సహిస్తున్న వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సెక్రటరి, కోచ్ టి.దీన్నాబాబు, వైస్ ప్రెసిడెంట్ బడేటి వెంకట రామయ్య, యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు డైరెక్టర్ డాక్టర్ కొవ్వూరు రామసుబ్బారెడ్డికి స్పాన్సర్‌షిప్ అందిస్తున్న రాధే గ్రూప్ చైర్మన్ ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, మేనేజింగ్ డైరెక్టర్ రాధేలకు పతక విజేత ప్రేమ్‌సాగర్ కృతజ్ఞతలు తెలిపాడు. ప్రేమ్‌సాగర్ గతంలో అనేక పోటీలలో పాల్గొని పతకాలు సాధించాడు. పతకం సాధించిన ప్రేమ్‌సాగర్‌కు క్రీడాభిమానులతోపాటు అసోసియేషన్ పెద్దలు అభినందనలు తెలియజేశారు.

జీజీహెచ్‌లో వెల్‌నెస్ సెంటర్ ప్రారంభం

గుంటూరు మెడికల్: గుంటూరు జీజీహెచ్‌లో వెల్‌నెస్ క్లీనిక్‌ను తూర్పు ఎమ్మెల్యే మొహమ్మద్ నసీర్ అహ్మద్ శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మారుతున్న ఆధునిక జీవనశైలి, అహారపు అలవాట్ల వల్ల వయసుతో సంబంధం లేకుండా అనేక మంది ప్రజలు బీపీ, షుగర్ వ్యాధి బారిన పడుతున్నట్లు చెప్పారు. ప్రజలకు ముందస్తుగా వ్యాధులపై అవగాహన కల్పించి వ్యాధుల బారిన పడకుండా ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వ ఆస్పత్రుల్లో వెల్‌నెస్ క్లీనిక్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ మాట్లాడుతూ ప్రతి సోమ, బుధవారం మూడో నంబరు ఓపీ గదిలో వెల్‌నెస్ క్లీనిక్‌లు పనిచేస్తాయన్నారు. జీవన శైలి వల్ల ప్రతి ఒక్కరూ ఒత్తిడికి గురవుతున్నారని, బీపీ, షుగర్ లాంటి వ్యాధుల బారిన పడుతున్నారని చెప్పారు. సీనియర్ ఐఏఎస్ స్పెషలిస్టు, హెచ్‌డీఎస్ సభ్యుడు డాక్టర్ శనక్కాయల ఉమాశంకర్ మాట్లాడుతూ ఆధునిక వైద్యాన్ని సామాన్యులకు చేరువచేయాలనే లక్ష్యంతో ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా సీఎం చంద్రబాబు వెల్‌నెస్ క్లీనిక్‌లను ప్రతి ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సమత, ఎస్‌పీఎం డిపార్ట్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ సీతారామ, జనరల్ మెడిసిన్ విభాగాధిపతి డాక్టర్ శైలజ, సివిల్ సర్జన్ ఆర్ఎంఓ డాక్టర్ బత్తుల వెంకటసతీష్‌కుమార్, అసిస్టెంట్ ఆర్ఎంలో డాక్టర్ జోతుల మురళి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నసీర్ అహ్మద్, పక్కన సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణ